# మా పెద్దనాన్న-కుక్క

వెచ్చగా శాలువా కప్పుకొని నమ్మకంగా నిద్రపోతున్న వాడిని ఢిల్లీ డిసెంబరు చలిలో అర్థరాత్రి జుత్తు పట్టుకుని మొలబంటి నీళ్ళలో ముంచితే వాళ్ళంతా ఎలా తిమ్మిరెక్కిపోతుంది? మా పెద్దనాన్న రిక్షా దిగుతున్నాడని మా ఆవిడ చెప్పగానే నాకల అయిపోయింది.

మా ఆవిడ పొరపాటు పడిందేమోనని స్పర్శాజ్ఞానం పోయిన శరీరాన్ని కాస్త కదిపి "ఎవరొచ్చారు?" అన్నాను.

సందేహంలేదు. ఊళ్ళోకి కలరా వచ్చిందన్నట్టు అదేవార్త చెప్పింది.

"మీ పెద్దనాన్న పరమేశంగారే"

ఆ పెద్దనాన్న గురించి యింత అసందర్భంగా, అగౌరవంగా చెప్తున్నానని మీరు నన్ను నిందిస్తే నా పూర్వ చరిత్ర మీకు తెలీదు కనక మిమ్మల్ని క్షమించడం తప్ప నేను చెయ్యగలిగిందేమీ లేదు. ఆయన మీద నాకు గౌరవం లేదనుకోవద్దు. గౌరవం త్రివేణీ సంగమంలో సరస్వతి నదిలాంటిది. కొందరు లేనిచోట ఆనందాన్ని కలిగిస్తారట. అలాంటి కారణ జన్ముల్లో మా పెద్దనాన్న ఒకరు. ఎప్పుడో నాకు బొత్తిగా జ్ఞానం తెలీని రోజుల్లో- అంటే నేను చదువుకొనే రోజుల్లో నేనింక ఎలాగూ బాగుపడనని నా మీద మా నాన్న ఆశలు వదులుకొని నన్ను మా పెద్దనాన్న ఊరుకి పంపించాడు. ఆ రోజుల్లో మా పెద్దనాన్న మా వూరుకరణం. ఆయుర్వేద వైద్యం చేస్తానని వూరందరిని బెదిరించిన మీదట ఆయన మాట కాదనలేకా ఆ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోలేకా కనీసం 20 కాపరాలు పట్నానికి తరలి

పోయినప్పుడు మిగతా పది కాపురాల్ని గవర్నమెంటు ఖాళీచేసేయించి అక్కడ పంచదార మిల్లు తెరిపించే సందర్భంలో నేనూ మా పెద్దనాన్నతో కలిసి పట్నానికొచ్చాను.

ఆ రోజుల్లో పెద్దనాన్నకి ఓ గట్టి నమ్మకముండేది. చదువుకొనే వాడు చావు దెబ్బలు తినడని–అందుకని ఆ యింటికి వచ్చినప్పటినుంచి చదువు చెప్పడానికి టైమున్నా లేకపోయినా చావగొట్టడానికి ఎలాగో ఒకలాగ వీలుచేసుకొని రెండు తగిలించి పడుకొనేవాడు. ఆ వూరు వచ్చే ముందు నోటికి వచ్చిన ఆరెక్కాలూ, పెద్దబాలశిక్ష పాఠాలూ మరిచిపోయాక ఆయన చాలా ఆనందించాడు. పూర్తిగా బ్రెయిన్‌వాష్ అయిన విద్యార్థిని చూసిన తన విజయాన్ని నా అజ్ఞానం ద్వారా కొలుచుకుని చూసుకొని సంబరపడ్డాడు. ఆ తర్వాత – ఆయన నేర్పిన విద్యవల్లే – పదేళ్ళు అటూయిటూ తిరిగి ఏ చదువూ ఎలాగూ వంటబట్టలేదు కనక ఆఖరికి బడిపంతుల్నయ్యాను. చదువురానివాడికి రెండే రెండు మార్గాలు. పార్లమెంటుకన్నా పోవాలి. బడిలో పాఠం చెప్పుకోడానికయినా పోవాలి. పార్లమెంటులో ఏం మాటా ఎవరూ పట్టించుకోరు. బడిలో ఎలా మాట్లాడినా పిల్లలకి అర్థమయి చావాలన్న పట్టింపులేదు.

ఇది నా పూర్వ చరిత్ర. ఎంత చచ్చినా చదువు చెప్పిన మనిషి మీద, జన్మనిచ్చిన తండ్రి మీదా ద్వేషం పుట్టగూడదు. నిజమే. మా పెద్దనాన్న మీద నాకు ద్వేషం లేదు. కాకపోతే మంత్రిగారిని డిగ్రీ అడిగి చిన్న బుచ్చినట్లు ఆయన్ని చూస్తే నా చిన్నతనం, అప్పటి నా చిన్నతనం గుర్తొచ్చి మరీ యిబ్బందిగా ఉంటుంది. మా పెద్దనాన్నకి ఓ గట్టి నమ్మకం ఉంది. తన దగ్గర చదువు నేర్చుకోడానికి వచ్చినవాడు తప్పనిసరిగా వెధవనీ, వాడికి వయస్సు వచ్చి మీసాలు మొలిచి, పెళ్లయి, పిల్లలు పుట్టినా ఎప్పుడూ అలానే ఉంటాడనీను. ఆయన దృష్టిలో నేనెప్పుడూలాగూ, బనీనూ వేసుకొనే బుజ్జిగాడిలాగే కనిపిస్తాను. "ఏడెనిమిది లెంతరా" అంటూ ఆలోచించే లోగానే చలిచీమలు కుట్టినట్లు వీపంతా గిల్లుతుండడం ఆయన సరదా. ఆ సరదా వెనక నిజంగా వీడికి లెక్క తెలిసిపోతుందేమోనన్న భయం ఉండేది. ఎందుకంటే తీరా ఏడెనిమిదులు ఎంతో చెప్పేస్తే తొడపాశం పెట్టే అవకాశం ఆయనకి ఉండదు. ఒక్కొక్కప్పుడు మొట్టికాయ వేసేవాడు. చెంపల దగ్గర జుత్తు పీకేవాడు. బొటనవేలు అడ్డంగా విరిచేవాడు. ఇలా ఆయన దగ్గర పోలీసులకి కూడా తెలియని రకరకాలయిన హింసాకాండ ఉంది. ఇదంతా మనిషిని సంస్కరించడానికి వివిధ ప్రయోగాలు ఆయన ఉగ్గు తాగకముందే ఎవరో ఆయనకి రంగరించి పోసేశారు. లేకపోతే ఆయన చాలా మంచివాడే. నాకు దగ్గర కూర్చుని భోజనం పెట్టేవాడు. తినకపోతే మొట్టికాయ వేసేవాడు. ఇవన్నీ ఆ వయస్సులో కేవలం శారీరకమయిన బాధలుగా మాత్రమే ఉండేవి. కాని నేను పెద్దవాడినయాక కూడా ఆయన దృష్టిలో చిన్నవాడిగానే మిగిలిపోవడం, నలుగురి ముందు నన్ను కడుపులో పొడవడం, వెధవా, అంటూ చెవి వెనక చెంపజుత్తులాగడం, యిలాంటివి ఎలా ఉంటాయో మీరు ఊహించగలరు. అంతకంటే జైల్లో పోలీసువాడి తన్నులు తిన్నా ఫరవాలేదు. పెద్దనాన్న హింసాకాండలో అసలు రహస్యం నన్ను హింసించడం కాదు. నన్ను

హింసించడం ద్వారా తన పెద్దరికాన్ని నేను పెద్దవాడనుకొంటున్న పెద్దల ముందు నిరూపించుకోవడం. అయితే నాలో గురుభావం, పెద్దల యెడల భక్తి, ముఖ్యంగా మా నాన్న పోతూ పెద్దనాన్న చేతుల్లో నన్ను పెట్టిపోవడం – యిలాంటివేవో – ఆయన చిత్రహింసకి గురిగా ఎరగా వర్ధిల్లేటట్టు చేశాయి. కాగా నన్ను అలా ఉతికేసిన రోజు ఆయన సుష్టుగా భోజనం చేసి హాయిగా నిద్రపోతాడు.

ఎందుకంటే ఆయనతరం గొప్పతనాన్ని గుర్తించేవాళ్ళంతా పోయారు. ఈ మాతరంలో తన గొప్పతనాన్ని నిరూపించుకోవడం అంటే ఈ తరంలో గొప్పవాళ్ళు వెధవలని నిరూపించడమనే సిద్ధాంతం మా పెద్దనాన్నది.

ఇది ఆయన వల్ల యితరులకి కలిగే బాధ అయితే ఆయన బాధలు కొన్ని ఉన్నాయి. అది ఈ మధ్య ముఖ్యంగా సాధించినది–రేచీకటి. చీకటి పడినా, మబ్బు వేసినా ప్రక్కన ఏనుగు నిలబడినా ఆయనకి తెలీదు. అందుకని ఎప్పుడన్నా మా వూరు తప్పనిసరిగా వెళ్ళినప్పుడు ఆ పనీ ఈ పనీ చూసుకొని చీకటి పడగానే యిల్లు చేరుకొని తెల్లవారురుఝాము బండికి బయలుదేరి పోవడం నేను అలవాటు చేసుకొన్నప్పుడు – మా పెద్దనాన్నకి మాత్రం కనీసం నన్ను కడుపులోనయినా వేలితో పొడవనందుకు మా చెడ్డ బాధగా ఉండేది. "రాత్రి వేళల్లో ప్రయాణం మంచిదికాదురా అబ్బాయి. ఒక రోజయినా ఉండి వెళ్ళు" అనేవాడు. మా దొడ్డమ్మ కూడా ఆయనతో ఏదైనా చెప్పాలన్నా చీకటిపడ్డాక ముహూర్తం పెట్టుకొనేది. ఇదేకాక ఆయనకి చుట్ట అలవాటు. తన దగ్గర చదువుకు వచ్చిన నాకు చుట్టలుచుట్టడం ఎలాగో నేర్పాడు. ఆ తర్వాత నెమ్మదిగా కాల్చడం నా అంతట నేనే నేర్చుకున్నాను. చీకటిపడ్డాక రెండు చుట్టలు తస్కరించి కాల్చిపారేసేవాణ్ని. వయస్సు మీరాక కూడా ఈ ముసలాయనతో బాధలు పడలేక ఓ నెలరోజులు నా దగ్గర ఉండమని రైలెక్కించేసి కాశీయాత్రకు పోయింది మా పెద్దమ్మ. కాశీలో కుక్కలు ఎక్కువని ఎవరో చెప్పడం వల్ల భేష్టి రానని యిటువేపు రైలెక్కి పోయాడు.

వచ్చిన రోజుదయమే పిల్లలకి పాఠాలు చెప్తుంటే కాఫీగ్లాసు పట్టుకుని వచ్చి కూర్చున్నాడు.

"అక్బరు చక్రవర్తి కాలంనాటి మాట" అని ఏదో చెప్తున్నాను.

ఇంకా కూరోచకుండానే అందుకున్నాడు.

"ఏమిటీ? హిస్టరీ చెప్తున్నావా?" అని.

"అబ్బేకాదు వేదాంతం" అక్బరు వివేకానంద స్వామి శిష్యుడు అందామనుకున్నాను.

"ఒరే అక్బరు గురించి చెప్పేముందు ఆగ్రా గురించి చెప్పావా?" అన్నాడు.

పిల్లలు తెల్లబోయి నన్ను చూస్తున్నారు. నేను తెల్లబోయి మా పెద్దనాన్నని చూస్తున్నాను.

"ఆగ్రా ఎందుకు?"

అంతే నా తెలివితేటలు ఆ ఒక్క ప్రశ్నతో నీరుకారిపోయాయి. సరాసరి నా చెవి పట్టుకుని "అందుకే వెధవ్వి. నువ్వింకా ప్రైమరీలోనే తగలడ్డావు. నీకో హిస్టరీ తెలిసి ఏడిస్తేగా?" అని పక్కకు జరిపి కూర్చోచన్నాడు. నా శిష్యులకి ఈయన చెవి పట్టుకోవడం, మహావిష్ణువును బస్సు డ్రైవరు ఉద్యోగం చెయ్యమని శాసించే ఆఫీసరులాగ కనిపించాడు. వాళ్ళు అబ్బురపాటుతో చూస్తూ ఉండిపోయారు.

"ఒరేయ్ – ఆగ్రా దేనికి ప్రసిద్ధో చెప్పండి" అన్నాడు మా పెదనాన్న.

వాళ్ళ ఆలోచనలు యింకా ఆగ్రాదాకా వెళ్ళలేదు. నా చెవిదగ్గర, ఆయన చేతిదగ్గర ఆగిపోయాయి.

'చెప్పులకండి' అన్నాడు శిష్యుడు.

వాళ్ళనాన్న హరిదాసు. అందుకు వాడి బుద్ధి సరాసరి చెప్పులమీదికి పోవడంలో ఆశ్చర్యం లేదు.

"ఓరి వెధవాయి. తాజ్‌మహల్ గురించి వినలేదురా?"

"విన్నామండీ"

"చూడలేదురా?"

"లేదండీ"

తాజ్‌మహల్ చూడకపోవడంలో వాడు చేసిన తప్పేమిటో నాకు తెలియదు. ఆ మాటకి వస్తే నేనే చూడలేదు.

పక్క విద్యార్థి వేపు తిరిగి "ఒరేయ్ బాబూ! నువ్వు గాడిదని చూశావురా?" అని ముద్దుగా అడిగాడు.

"ఓ! ఎన్నోసార్లు చూశాం" అన్నాడు వాడు.

ఆగ్రాలో తాజ్‌మహల్ గురించి అడిగాక తననేం అడుగుతాడో అని భయపడుతున్నావాడు. ఇంత సులువు ప్రశ్న ఎదురవుతుందని వాడు ఊహించలేదు.

"ఎక్కడరా"

"రోడ్డు మీదండీ"

"ఛ ఛ – నీ పక్కనే ఉంది. బాగాచూడు" అన్నాడు పెద్దనాన్న.

నేను తుళ్ళిపడ్డాను. ఎందుకంటే తాజ్‌మహల్ చూడలేదన్న శిష్యుడి పక్కన నేనూ ఉన్నాను. ఇద్దరిలో ఇప్పుడెవరు గాడిదో అర్థం కాలేదు.

మా పెద్దనాన్నే భాష్యం చెప్పాడు. "వీడు తాజ్‌మహల్ చూడలేదంటే యిహ ఈ జన్మలో బాగుపడడు. ఒరేయ్ బాబూ – మనలోలాగా తురకలు చచ్చిన వాళ్ళకి తద్దినాలు పెట్టరు. ఏకంగా ఒకేసారి సమాధి కట్టేస్తారు. డబ్బున్న ఓ మహరాజు అలా కట్టించిన పెద్ద సమాధి అన్న మాట స్థూలంగా ఈ తాజ్‌మహల్" అని నా వేపు తిరిగి "ఒరేయ్ నీ పాఠం నా మొహంలా ఉందిగాని లోపలికి వెళ్ళి ఓ మంచి చుట్టపట్రా" అన్నాడు.

నా విద్యార్థులకు ఆ రోజు పెద్ద పండగ. రోజూ నేను వాళ్ళకి విధించే శిక్షల్ని అతి సునాయాసంగా నాకు విధించే వ్యక్తిని వాళ్ళు చూశారేమో–ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయి అయిదు నిముషాల్లో అంతా మా పెద్దనాన్నకి దాసానుదాసులైపోయారు.

ఇది కేవలం ప్రారంభం మాత్రం.

ఆ మధ్యాహ్నం ఎలక్ట్రిక్‌సిటీ బిల్లు కట్టినా కట్టలేదని గుర్తు చెయ్యడానికి డిపార్టుమెంటు మనిషి వచ్చినప్పుడు అలవాటు ప్రకారం పాత రసీదు వెదుకుతున్నప్పుడు మధ్యలో కలగజేసుకొని–

"ఏమిట్రా అలా వెదుకుతావు. చెట్టంత మనిషి వచ్చి నువ్వు కట్టలేదని చెపుతుంటేను" అన్నాడు.

ఈ చెట్టంత మనిషి ప్రతిసారీ వస్తాడు. కట్టినా వస్తాడు. రసీదు చూపడం నా అలవాటు అని చెప్పబోయాను. కాని మా పెద్దనాన్న వినిపించుకోలేదు.

"కడితే ఎందుకు వస్తారు? అసలు నీకు రసీదు చదవడం వచ్చా రాదా అని నా అనుమానం. ఏదీ ఎలక్రిక్ స్పెలింగు చెప్పు".

ఇదంతా డిపార్టుమెంటు మనిషి ముందు.

నేను వికవికలాడిపోయాను. ఎంత చదువుకొన్నా ఉన్నపాటునే "పురుషులందు పుణ్యపురుషులు వేరయా పద్యం పూర్తిగా చెప్పు" అనగానే కాస్త తడబడక తప్పదు. తీరా ప్రయత్నిస్తే ఆ క్షణంలో స్పెల్లింగు కొరకబడలేదు సరికదా – కోపం, బాధ, నిస్సహాయత తలకెక్కిపోయాయి.

"నన్నడిగావుగాని నువ్వు చెప్పు చూద్దాం" అన్నాను జీవితంలో మొదటిసారిగా ఎదిరించి–

ఒక్కసారి కళ్ళజోడు కిందనుంచి నన్ను కొరకొరచూసి కడుపులో వేలుతో పొడిచి "నాకు తెలీదు కనకేనోయ్ – నిన్ను అడిగాను" అని లోపలికి వెళ్ళిపోయాడు. తనకి తెలియకపోవడం కూడా ఒక ప్రత్యేకత అయినట్టు –

అయ్యో – యిలా ఎన్నాళ్ళు యీయనతో తంటాలు పడాలో తెలీక మీమాంస పడడంతో తెల్లారేసరికి చిన్న జ్వరం వచ్చేసింది. మా పెద్దనాన్నని ఏదయినా హోటలులో ఉంచి బిల్లు కట్టమంటే నిరభ్యంతరంగా కట్టగలను. ఆయన ఉన్నన్నాళ్ళు నన్ను హిమాలయాలకు పొమ్మన్నా పోతాను. కాని ఈ బాధ మాత్రం భరించలేనని తేలిపోయింది. ఈయన్ని వదిలి కాశీ యాత్రకి వెళ్ళిన మా దొడ్డమ్మ మీద మొదటిసారిగా ఈర్ష్య, కోపం కలిగింది.

ఇదిగో–ఇట్టి విపత్కర సమయంలో మా కేశరావు కుక్క నాకు పెట్టని కోటలాగ, ప్రతాపరుద్ర చక్రవర్తికి యుగంధుడిలాగ బాసటగా నిలిచింది. అసలు కేశరావుని చూశాకే వాడి కుక్క నాకు గుర్తు వచ్చింది. ఎలాగంటే కేశరావుని, వాడి కుక్కని ఉమ్మడిగా చూస్తే ఏ

జన్మలోనో వాళ్ళిద్దరూ సహోదరులయి ఉంటారని మనకి తప్పక అనిపిస్తుంది. అంత దగ్గర పోలికలు వాడికీ వాడి కుక్కకీ ఉన్నాయి. అంచేతనేవాడు తిరుపతి వెడుతున్నానని చెప్పగానే "నీ కుక్కనేం చేశావు?" అన్నాను చటుక్కున గుర్తొచ్చి.

"ఏం చేయాలో తోచడంలేదు బ్రదర్. నాలుగు రోజులు దాని అజాపజా చూసుకొనే మిత్రుడు కనిపించడంలేదు. నీ దగ్గరి వదిలిపోదామంటే కుక్కలంటే మీ ఆవిడకి బొత్తిగా గిట్టదుకదా" అన్నాడు.

మా ఆవిడకి గిట్టని మాట నిజమే కాని మా పెద్దనాన్నకి కుక్కంటే చచ్చేంత భయం అని నాకు అప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఆయన ఎంత దైవ నిష్టాపరుడైనా ఖర్మకాలి దేవుడు ఏ కుక్కకైనా స్వర్గలోకాన్ని ప్రసాదించాడని తెలిస్తే స్వర్గానికయినా రావడం మానేస్తాడు కాని కుక్కని ఆ లోకంలో భరించలేదు.

దీనికి కారణం–20 ఏళ్ళనాడు మా వూరి నాయుడుగారి పెంపుడు కుక్క మా పెదనాన్నని కరిచింది. నాయుడుగారు ఆ వూరికి కొత్తగా వచ్చిన రోజులు. ఆ కుక్కకిమా పెద్దనాన్న కొత్త. అందుకని ఓ సాయంకాలం నాయుడుగారి కోసం వెళ్ళినపుడు మా పెదనాన్నని చూసి ఉన్నపాటునే ఆయన పెద్దమనిషో దొంగో తేల్చుకోలేక ఎందుకయినా మంచిదని తన జాతి లక్షణానికి మచ్చరాకుండా – కాలిపిక్క మీద రెండంగుళాల మేర కరిచి పొలాల్లోకి పారిపోయింది.

ఇంటిల్లిపాదీ ఆ చర్యకి గొల్లుమన్నారు. తర్వాత తెలిసింది నాయుడుగారికి ఆ కుక్క కొత్తేనని. కుక్క పిచ్చిదయితే పధ్నాలుగు, మంచిదయితే అయిదు ఇంజక్షన్లు బొడ్డు చుట్టూ యివ్వాలని డాక్టరు చెప్పాడు. ఇప్పుడు చేసిన పనిని బట్టి నాయుడుగారే ఆ కుక్కపిచ్చిదో కాదో గట్టిగా తేల్చి చెప్పలేకపోయారు. దాన్ని తెలిసిన నలుగురు పొలాలకు నాలుగు వేపులా పడి వెదికారు. మరి ఇద్దరు గట్టిగ్గా ఆలోచించి దానికి చిన్న మెల్ల ఉందికాని, పిచ్చి ఉన్నట్టు గుర్తులేదని తేల్చారు.

మరి మా పెద్దనాన్నలాంటి పెద్దమనిషిని దొంగ అని ఎలా అనుమానించి ఉంటుంది? అప్పటికి ఒక విషయం తెలిసింది. ఆ కుక్క తండ్రివేపు మూడు తరాల క్రిందట ఆ కుక్క ముత్తాత ఓ మంత్రిగారి హయాంలో పెరిగాడని. అందుకని పెద్దమనిషిలా అనిపించినంత మాత్రాన పెద్దమనిషిఅని సరిపెట్టుకోకూడదన్న సత్యం – దానికి వారసత్వంగా అలవడినందువల్ల కరిచి ఉంటుందని తేల్చి అయిదు ఇంజక్షన్లతో వైద్యాన్ని సరిపెట్టేశారు. ఆ తర్వాత యింట్లో కుక్క అన్న పేరున్న బొమ్మలున్నా, పుస్తకాలున్నా చించి పారేశాడు పెద్దనాన్న. అప్పటినుంచి ఈనాటివరకూ 'కుక్క' నిష్టని మాత్రం వదులుకోలేదు.

ఈ విషయాలన్నీ కళ్ళముందు కదలగానే గజేంద్రుడికి కళ్ళముందు కదిలినంత ఆనందం కలిగింది.

"అదేమిట్రా! స్నేహితులమయాక కుక్కల కోసం మొహం చూసుకుంటామా?

రాత్రికి తెచ్చి మా యింట్లో కట్టేయ్. నువ్వు మళ్ళీ తిరిగి వచ్చేవరకు నిన్ను చూసినట్టుంటుంది నాకు" అన్నాను.

కేశవరావు మొహం యింతయిపోయింది.

మర్నాడు ప్రొద్దుట నిద్రలేస్తూనే ఏవో కేకలు వినిపించి మా పెద్దనాన్న మా ఆవిడని అడిగాడు.

"ఏమిటా కుంక అలా కేకలేస్తున్నాడు" అని.

మా ఆవిడ సిగ్గుపడుతూ "ఆయన కాదండీ—కుక్క" అంది. ఇంకా అర్థం కాలేదు ఆయనకి.

"ఏమిటి? – వీడు కుక్కలాగా అరుస్తున్నాడా? కుక్క వీడిల్లాగ అరుస్తోందా?" అన్నాడు యింకా అనుమానం తీరక.

"కమాన్ జిమ్మీ – కమాన్" అంటూ గొలుసు పెద్దనాన్నకి వినిపించేలాగా ఆడిసూ లోపలికి వచ్చాను.

అంతే – నిద్రమత్తంతా జిమ్మీని చూస్తూనే వదిలిపోయింది పెద్దనాన్నకి.

"ఏమిట్రా దిక్కుమాలిన కుక్క ఎవరిదిరా, పొద్దుటే తెచ్చావు" అన్నాడు కోపంగా.

"ఇది దిక్కుమాలిందికాదు పెద్దనాన్నా. దీని యజమాని–నా మిత్రుడు కేశరావు తిరుపతి వెళ్ళాడు. దేవుడికీ భక్తుడికీ మధ్య కుక్కలకి తావులేదని దొడ్డమ్మ నిన్ను యిక్కడికి పంపినట్లుగా దీన్ని మా యింటికి పంపేశాడు"

మాటలో వ్యంగ్యం కంటే కుక్క మొహం కొట్టొచ్చినట్టు కనిపించి అలా బిక్కచచ్చిపోయాడు దాని మొహం చూస్తూ.

కేశవరావు మొహం, వాడి కుక్క మొహం ఒకలాగ ఉంటాయని చెప్పాను. కాని అసలు వాళ్ళిద్దరి మొహాలు ఉంటాయో మీకు చెప్పలేదు. మరీ గెడ్డం పెరిగిన రామకృష్ణ పరమహంస ధ్యానంలో ఉన్నప్పుడు తీయించుకున్న ఫోటోలు మీరు చూసిఉంటారు. ధ్యానంలో ఉన్నప్పుడు పాపం ఆయన్ని తేలు కుట్టిందనుకోండి – ఆ మొహం ఎలా ఉంటుందో మీరు ఊహించగలిగితే మీరు కాస్త వాస్తవానికి దగ్గరగా వచ్చిన వాళ్ళవుతారు. ఇప్పుడు జిమ్మీ – ఆ రకమయిన మొహంతో పెదనాన్నగారిని గమనిస్తోంది. తొలిచూపులోనే కొందరికి ప్రేమ కలిసిపోతుందని పెద్దలంటారు కాని ప్రస్తుతం వీళ్ళిద్దరి మధ్యా తొలిచూపులోనే ఒకరిపట్ల ఒకరికి అవిశ్వాసం ఏర్పడిందని నేను గ్రహించాను. జిమ్మీ ఒక గావుకేక పెట్టింది.

మా పెద్దనాన్నని పెద్దమనిషిలాగా–జిమ్మీ కలలో కూడా అంగీకరించదని తేలిపోయింది. పెద్దనాన్న ఒక గెంతు గెంతి పెరట్లోకి పోయాడు.

నాకు జిమ్మీ మీద ఎనలేని ప్రేమ కలిగింది. మా ఆవిడ చెప్తున్నా వినిపంచుకోకుండా– ఓ సీసా పాలు ఆమె సాహసానికి విరాళంగా బహూకరించాను.

ఆ రోజంతా మా పెదనాన్న పెరటివేపు తిరుగుతున్నాడు. నేను జిమ్మీతో సహా బయటి వరండాలో ఉన్నాను.

"ఆ వెధవని ఆ కుక్కని యిచ్చేసి రమ్మని చెప్పమ్మా" అని మా ఆవిడని సముదాయించాడు.

కానీ మా ఆవిడ ఏమీ చెప్పలేకపోయింది.

"చూడగా దీనికంటె నాయుడుగారి కుక్క కాస్త నయమనిపిస్తోంది. మరీ ముఖం చూస్తేనే అరుస్తోంది వెధవ పీనుగు" అని విసుక్కున్నాడు.

దరిమిలాను నాకు ఉత్సాహాన్ని కలిగించిన సత్యమేమిటంటే, మా పెద్దనాన్నకు నచ్చే ఏ విషయమూ జిమ్మీకి నచ్చకపోవడం – పొద్దుటే టిఫిన్ తిని, కర్ణాటక సంగీత సాధన చేయడం పెదనాన్న అలవాటు – దానివల్ల సంగీతానికి ఉపయోగమో ఆయనకి ఆనందదాయకమో తెలీదు కాని – జిమ్మీ తన అసమ్మతిని దృఢంగా తెలియపరిచింది.

ఇలా వివిధ రంగాలలో వారిద్దరి మధ్యా ప్రచ్ఛన్న యుద్ధం సాగుతూ వచ్చింది. కాని క్రమక్రమంగా మా పెద్దనాన్న కుక్కకి అలవాటుపడ్డాడో, కుక్కే పెద్దనాన్నకి అలవాటు పడిందో కాని ఎవరి స్థానాల్లో వారు నిలదొక్కుకుని ఉండిపోయారు.

ఇంక మా పెదనాన్న వెళ్ళే ధోరణి కన్పించలేదు. కేశవరావు వచ్చే సమయం దగ్గర పడిపోతోంది. మా ఆవిడ ముందు ఈ విషయం మొరపెట్టుకున్నాను.

కాని ఎవరికో తారాబలం మారింది. మర్నాటికల్లా సమస్య తీరిపోయింది. తె[illegible] వరండాలో పడుకోవలసిన జిమ్మి అక్కడ లేదు. నాకు వెంటనే మా పెదనాన్న మీదక మనస్సు పోయింది. వెంటనే పెరటివేపు బయలుదేరాను. ఎప్పుడు ఇద్దరికీ రాజీ కుదిరిపోయిందో గాని వేపచెట్టు నీడలో మంచం మీద ఇద్దరూ ఒకరినొకరు కౌగలించుకొని చిరకాల మిత్రులుగా నిద్రపోయారు.

"అమ్మ పెదనాన్నా – జిమ్మీ నీకింత మచ్చికయి పోయిందని చెప్పవేం?" అంటూ లేపాను.

లేచి తన మంచం మీద జిమ్మీని చూసి కెవ్వుమన్నాడు పెదనాన్న.

"అయ్యో ముదనష్టపు పీనుగు" అని ఎగిరి గంతేశాడు.

ఆ తిట్లునన్నో, కుక్కనో అర్థంకాక తెల్లబోయి నిలబడ్డాను. జిమ్మీలేచి రామకృష్ణ పరమహంసలాగ ముఖం పెట్టి అరవడం ప్రారంభించింది.

దాని సరసన ఒక రాత్రి నిద్రపోవలసి వచ్చిందన్న ఆలోచన మా పెదనాన్నని స్థిమితంగా ఉండనివ్వలేదు. ఇక భస్తే ఇంట్లో ఉండనని చెప్పి నేను మా ఆవిడా బ్రతిమాలినా వినకుండా రాత్రి మెయిలెక్కాడు.

ఆ రోజు జిమ్మీకి ప్రత్యేకమయిన విందు చేయించాను. కాని పరస్పరం

శ్రతువుల్లాగా మెలిగే జిమ్మి పెద్దనాన్న ఒకే మంచం మీద ఎందుకు పడున్నట్లో ఈ సందేహం తీరలేదు. తరవాత కేశరావుని అడిగాను.

"అసలేం జరిగిందో చెప్పు" అన్నాడు. చెప్పాను.

"అదా? – నువ్వే జిమ్మీని అపార్థం చేసుకున్నావు. దానికి చాలా యిష్టమయిన వ్యక్తుల్ని చూసినప్పుడు రామకృష్ణ పరమహంసలాగ ముఖం పెడుతుంది. మీ పెదాన్న అన్నా ఆయన కర్ణాటక సంగీతమన్నా దానికి చచ్చే యిష్టమన్నమాట. అందుకే అలా తన భాషలో గౌరవాన్ని పదేపదే ప్రకటించి ఉంటుంది" అన్నాడు.

"ఆహా యిదే మనుషులకీ, కుక్కలకీ తేడా!" అనుకున్నాను. మాచాడి పరమహంస ముఖం అయిష్టానికి, జిమ్మీ మొహం యిష్టానికి చిహ్నం.

ఏమయినా మా పెదనాన్న వెళ్ళిపోయాడు. నాయుడుగారి కుక్క వల్ల మా పెదనాన్నకి జరిగిన అపకారం 20 ఏళ్ళ తరవాత కేశరావు కుక్క ద్వారా నాకు ఉపకారమవుతుందని నేను కలలో కూడా ఊహించలేకపోయాను.

(ఆంధ్రభూమి 22.9.1999)

---